రంజాన్ ఉపవాస దీక్ష
సమయ పట్టిక ఆవిష్కరణ

రంజాన్ ఉపవాస దీక్షకు సంబంధించి సమయ పట్టికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రంజాన్ ఉపావాస దీక్షకు సంబంధించి ఇఫ్తార్, సహర్ సమయ పట్టికను మంగళవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుంబాల రవియాదవ్, గైని శ్రీనివాస్ గౌడ్, బల్వంత్ రావు, మాజిద్, కృష్ణయాదవ్, నేరడి సాయి, దినేశ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్లు కాంపౌండ్లలో
మైనర్లను పెడితే చర్యలు

● ఏఎస్పీ చైతన్యారెడ్డి

కల్లు కాంపౌండ్ యజమానులతో మాట్లాడుతున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : ప్రతి కల్లు కాంపౌండ్‌లో కనీసం 6 సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, 18 ఏండ్లలోపు మైనర్లను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ చైతన్యారెడ్డి హెచ్చరించారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏరియాలో ఉన్ని అన్ని కల్లు కాంపౌండ్ల యజమానులతో మంగళవారం ఏఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కల్లు సైతం విక్రయించకూడదని, కల్లు కాంపౌండ్ లో చిన్న పిల్లలు కనబడితే ఆ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజంపేటలో 'ఆరోగ్య మహిళ'

రాజంపేట్, ఫిబ్రవరి 25: రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధికారిణి విజయ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 54 మంది మహిళలకు వైద్య పరీక్షలు, 31 మందికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, ఐశ్వర్య, సూపర్‌వైజర్ మంజూర్, గంగామణి, ఏఎన్ఎమ్‌లు, ఆశకార్యకర్త లు గర్భిణులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన
వ్యక్తిపై కేసు నమోదు

మద్నూర్, ఫిబ్రవరి 25: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇంటి వద్ద మురికి కాలువ విషయంలో పండరి, మాణిక్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య మంగళవారం గొడవ జరిగింది. గ్రామ పెద్ద మనుషులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని లచ్చమ్మ ఆలయం వద్ద ఉన్న పండరిపై మాణిక్ కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 25 : సంగారెడ్డిలో ఈ నెల 23న వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో పెద్ద కొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కమల మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు, ఆరుగురు వెండి పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శివప్రసాద్, విద్యార్థులను తహసీల్దార్ దశరథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి సలాం

మాచారెడ్డి, ఫిబ్రవరి 25 : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడాలని, చదువుతోపాటు క్రీడలు సైతం అవసరమని సూచించారు. అనంతరం కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యాకినూద్దీన్, అధ్యాపకులు నర్సింహులు, రామకృష్ణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు
పరిష్కరించేలా సహకరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్

న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : జిల్లా సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8 వ తేదీన నిర్వహించబోయే జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సహకరించాలన్నారు. ముఖ్యంగా సివిల్, మోటర్ వెహికిల్ యాక్సిడెంట్, కంపౌండబుల్ క్రిమినల్ కేసులు ఈ అదాలత్‌లో పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఉల్లాహ్‌ఖాన్ పాల్గొన్నారు.

త్వరలో టీఎన్జీవోస్‌తో ప్లాటినం జూబ్లీ

సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కామారెడ్డి, ఫిబ్రవరి 25 : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీఎన్జీవోస్ ప్లాటినం జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలకు సీఎం సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. దానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీవోస్ కీలక పాత్ర పోషించిందని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 310 జీవోను సవరించాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కామారెడ్డి జిల్లా సహ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సంతోష్, రాజ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సృజన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, ఫిబ్రవరి 25 : మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం..మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన రమెల్ల బాబు (30) రెండేండ్లుగా తాగుడికి బానిసై ఎలాంటి పని చేయకుండా ఇంట్లోనే ఉండేవాడు. సోమవారం రాత్రి భార్యను మద్యానికి డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. రూమ్‌లోకి వెళ్లి డోర్ పెట్టుకొని ఉరేసుకొన్నాడు. గమనించిన కుటుంబీకులు కిందికిదించి 108 అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హాజీపూర్ కట్టకింది తండాలో మరో యువకుడు..

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హాజీపూర్ కట్టకింది తండాలో మంగళవారం జరిగింది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన కడావత్ రెడ్యా (26) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. అతడికి ఐదేండ్ల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెడ్యా తండ్రి కడావత్ చందర్ పోషణ నిమిత్తం డబ్బులు కావాలంటూ రెడ్యాను అడిగేవాడు. ఈ విషయమై ఇద్దరికీ చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. 25వ తేదీ సోమవారం ఈ విషయమై తండాపెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుంటూ ఉండగా, ఇద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన రెడ్యా ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడినుంచి పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. కేవలం గొడవ వల్లనే తన భర్త ఉరి వేసుకొని మృతిచెందాడని, మృతుడి భార్య శాంతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఫత్లాపూర్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న ఇల్లు

బిచ్కుంద, ఫిబ్రవరి 25 : మండలంలోని ఫత్లాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన మచ్కురి సాయిలుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సాయిలుకు ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఇంటికి తాళం వేసి దవాఖానకు వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో నిప్పు అంటుకుంది. ఇంట్లో వస్తువులు, బీరువాలో ఉన్న వస్తువులు, నగలు, దుస్తులు పూర్తిగా కాలి బుడిదయ్యాయి. గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాకపోవడంతో మద్నూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో సాయిలు కుటుంబం కట్టు బట్టలతో రోడ్డు పాలయ్యారు. గ్రామ కార్యదర్శి పద్మ సందర్శించి పంచనామా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం 5 తులాల బంగారం, రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

గోపాల్‌పేట ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదువుకొని ఉన్నత చదువులు పూర్తి చేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. విద్యార్థులు చేసిన ఉపాన్యాసాలు, పాటలు, నృత్యాలు అలరించాయి. పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శులు సమయపాలన పాటించాలి

నిజాంసాగర్‌లో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

నిజాంసాగర్, ఫిబ్రవరి 25 : ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ, ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో గంగాధర్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు గ్రామాల్లో రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో అనిత తదితరులు పాల్గొన్నారు.

దారిలో మురుగు తొలగించారు

గోపాల్‌పేటలో దారి మధ్యలో మురుగునీటిని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్న పంచాయతీ కూలీలు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రం గోపాల్‌పేట్‌లో సుభాష్ చంద్రబోస్ కాలనీకి వెళ్లే దారిలో పారుతున్న మురుగునీటిని మంగళవారం గ్రామ కార్యదర్శి కిష్టయ్య సిబ్బందిని ఏర్పాటు చేసి తొలగింపజేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మంగళవారం 'దారిలో మురుగుతో అవస్థలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు కూలీలను ఏర్పాటు చేసి నూతన రహదారి కోసంఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి పైపులను ఏర్పాటు చేసి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు మండల కేంద్రంలో దారిలో ఆగుతున్న మూడు చోట్ల మురుగునీటిని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి తరలిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు ఉపాధ్యాయుల ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రామారెడ్డి, ఫిబ్రవరి 25 : మండలంలోని స్కూల్‌తండా గ్రామంలో ఇటీవల ఇద్దరు చిన్నారులు గంగావత్ సంజన, బిందు కూల్‌డ్రింక్ అనుకొని క్రిమి సంహారక మందు తాగిన విషయం విదితమే. చిన్నారుల చికిత్స నిమిత్తం రెడ్డిపేట్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఎండలు ముదరక ముందే పనులు చేసుకోవాలి

మీసన్‌పల్లి పర్క్యులేషన్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 25: ఎండలు ముదరక ముందే, పొద్దుపొద్దునే ఉపాధిహామీ పనులను ముగించుకోవాలని ఎంపీవో ప్రకాశ్ సూచించారు. మండల పరిధిలోని మీసన్‌పల్లి గ్రామ అటవీప్రాంతంలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా కొనసాగుతున్న పర్క్యులేషన్ ట్యాంకు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పనులను సూచించిన కొలతల ప్రకారం చేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు ముగించాలన్నారు. పనులు జరిగేచోట కూలీలలకు తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సోమిర్యాగడితండాలో..

మండలంలోని సోమిర్యాగడితండాకు చెందిన నర్సరీని ఎంపీవో ప్రకాశ్ సందర్శించారు. జర్మినేషన్ రాని బ్యాగుల్లో వెంటనే కొత్త విత్తనాలు నాటాలన్నారు. ఎండలు ప్రారంభమైనందున మొక్కలకు రెండుసార్లు నీళ్లు పట్టించాలని సూచించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సరీ వాచర్ తదితరులున్నారు.

రెండు రోజులపాటు వైన్స్‌లు బంద్

● నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ● ఎక్సైజ్‌శాఖ అధికారులు

ఎల్లారెడ్డి పట్టణంలోని మద్యం విక్రయశాలను మూసివేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 25: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున రెండు రోజుల పాటు మద్యం విక్రయ దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పట్టణంలోని వైన్స్‌లను అధికారులు మంగళవారం మూసివేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం విక్రయ దుకాణాలు, బార్, కల్లు డిపోలు, కల్లు దుకాణాలను మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటల వరకు మూసి ఉంచాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి వీసీ
ప్రశంసాపత్రం అందజేత

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేసిన టీయూ వీసీ

రామారెడ్డి(సదాశివనగర్)ఫిబ్రవరి 25 : సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో ఏడాది చదువుతున్న బి.మానస జాతీయ సమైక్యతా శిబిరానికి ఎన్నికై శిబిరం పూర్తి చేసింది. ఇందుకుగానూ తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ టీ యాదగిరిరావు మంగళవారం ఆమెకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మీనా, శ్రావణి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఒకరి బైండోవర్

తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఏఎస్సై

లింగంపేట, ఫిబ్రవరి 25: మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన దర్శనం ఈశ్వర్ అనే యువకుడిని తహసీల్దార్ రాజనరేందర్ గౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో ప్రకాశ్ తెలిపారు. దర్శనం ఈశ్వర్ సోమవారం రాత్రి మద్యం మత్తులో డయల్ 100 కు కాల్ చేసి దుర్వినియోగం చేసినట్లు ఆయన తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటానని కాల్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

బిచ్కుంద, ఫిబ్రవరి 25 : నర్సరీల్లో మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో నర్సరీ, ప్రభుత్వ దవాఖాన, పోలింగ్ బూత్, పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ దవాఖానను సందర్శించి రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట గ్రామ కార్యదర్శి, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న సాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ రఫీక్, ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్థానిక సాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ రఫీక్ పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందించారు. కష్టపడి చదువుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. రఫీక్‌కు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

లింగంపేట, ఫిబ్రవరి 25: మండలంలోని అన్ని పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో డిమాండ్‌కు అనుగుణంగా, పెండింగ్‌లో ఉన్న పన్నులు సైతం వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా క్షేత్ర సహాయకులు, గ్రామ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హారీ, ఏపీవో నరేందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, PENDAM NARENDAR, S/o. Pendem Bhumeshwar, R/o.H.No.6-59, Morthad Vill. & Mdl. Nizamabad Dist., T.S., My Passport No. H2025508 have changed my name as PENDEM NARENDHER (New name)
NTZ-338516

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విహారయాత్రకు విద్యార్థులు

స్వర్ణగిరి ఆలయం వద్ద గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

గాంధారి, పిబ్రవరి 25: పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8,9వ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు విహారయాత్రకు తీసుకెళ్లారు. విద్యార్థులకు యాదాద్రి ఆలయంతో పాటు స్వర్ణగిరి ఆలయం, సిద్దిపేట్ కోమటి చెరువును చూపించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రంగా వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ చారిత్రక కట్టడాలతో పాటు, పురాతన ఆలయాలను చూపించడం ద్వారా వాటి పై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజాపండిత్, మల్లేశ్, శ్రీదేవి, వనజ, రాధాదేవి, చక్రధర్, శరణ్య, సంగీత, జ్ఞానేశ్వర్, బాలర్‌రెడ్డి, నాగలక్ష్మి, సాయులు పాల్గొన్నారు.